వికారాబాద్ జిల్లాలో పచ్చని చెట్లతో నిండుగా కనిపిస్తున్న దామగుండం అటవీ ప్రాంతం

రాడార్ స్టేషన్ ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

భారీ వృక్షాలతో కనువిందుగా దామగుండం అటవీ ప్రాంతం

లోకం పోకడ

పండగ రోజు నీళ్ల తో పాటు నాన్.. వెజ్ కూడా సరఫరా చేసినట్టుంటుందని అనుకున్నామయ్యా!

మూసీకి మరణశాసనం

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డిని నిలదీశారు. ఏ ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో దీనిని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో హరితహారంతో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచింది. రేవంత్‌రెడ్డి రాగానే దామగుండంలో దాదాపు 2,900 ఎకరాల అటవీ ప్రాంతాన్ని నాశనం చేసే వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌కు అంగీకారం తెలిపిండు.
-కేటీఆర్

పదేండ్లు నిలువరించాం

దామగుండంలో రాడార్ ఏర్పాటుతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. దాదాపు 2,900 ఎకరాల అటవీ ప్రాంతంలో 12 లక్షల చెట్లను నేలమట్టం చేసి ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని తెలంగాణలోనే ఎందుకు నిర్మిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ పరిరక్షణ అని చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ మూసీనే ప్రమాదంలోకి నెట్టే ప్రాజెక్ట్‌కు ఎందుకు అంగీకరించారో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లలో కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా అంగీకారం తెలుపలేదని గుర్తుచేశారు.

అక్కడో న్యాయం.. ఇక్కడో న్యాయమా?

గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకోసెన్సిటివ్ జోన్‌గా ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేస్తూ 'గంగోత్రికి ఓ న్యాయం.. మా మూసీ నదికి మరో న్యాయమా?' అని ప్రశ్నించారు. రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానం ఉన్నదని, నది పుట్టిన ప్రాంతాన్ని 'ఎకోసెన్సిటివ్ జోన్'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నది అంతర్ధానమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సోర్స్ అఫ్ ద రివర్'పై రాడార్ ప్రాజెక్టు గొడ్డలి పెట్టు వంటిందని తెలిపారు. మూసీ నది పురుడు పోసుకున్న చోట 12 లక్షల చెట్ల నరికివేతతో కోలుకోలేని అనర్థం జరుగుతుందని హెచ్చరించారు. పర్యావరణ సమతుల్యతకు పెనుప్రమాదాన్ని సృష్టించే రాడార్ ప్రాజెక్ట్‌ను విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రాడార్‌కు వ్యతిరేకంగా పోరుబాటే

మూసీ నదిని పణంగా పెట్టేందుకు సహకరిస్తూ మరోవైపు మూసీ పరిరక్షణ అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ పరిరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాడార్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారం తెలిపేది కాదని పేర్కొన్నారు. మూసీ పేరుతో వేల కోట్ల దోపిడీ చేయాలన్న ఆలోచనే తప్ప నిజంగా నది పరిరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు.

గంగానదికి ఓ న్యాయం..

మూసీకి మరో న్యాయమా?

- గంగమ్మ జన్మస్థలం గంగోత్రి 'ఎకో-సెన్సిటివ్ జోన్'గా గుర్తింపు
- ఏ నిర్మాణాలు చేపట్టవద్దని కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్
- నదీపరీవాహాలను రక్షించాలని పలు నిబంధనలు జారీ
- మూసీ విషయంలో మాత్రం ఇవేమీపట్టని రాష్ట్ర ప్రభుత్వం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు మూసీ సుందరీకరణకు లక్షల కోట్ల ప్రాజెక్టులు చేపడుతున్న రేవంత్ ప్రభుత్వం.. అదే మూసీకి చేటుగా మారిన ఈ రాడార్ స్టేషన్‌కు సుముఖంగా ఉండటంపై పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో గంగానది విషయంలో ఒక న్యాయాన్ని, మూసీ విషయంలో మరో న్యాయాన్ని పాటించడమేంటని నిలదీస్తున్నారు.

గంగానది విషయంలో ఏమైంది?

హిందువులు పరమ పవిత్రంగా కొలిచే గంగానది గంగోత్రి హిమానీనదంలోని గోముఖ్ నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. అటవీ భూముల్లో విస్తరించిన ఈ ప్రాంతంలో నిర్మాణాలు, పర్యాటక, వాణిజ్య కార్యక్రమాలు చేపడితే అది గంగానది అస్థిత్వానికే ప్రమాదమని కేంద్రప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో గంగానది, దాని పరీవాహంలో నివసిస్తున్న జీవజాలం పరిరక్షణకు 2012లో గంగోత్రి ఎకో-సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జడ్) పేరిట ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. గంగానది జన్మస్థలానికి సుమారు 150 కిలోమీటర్ల మేర పరిధిని పర్యావరణానికి అత్యంత సున్నితమైన ప్రాంతంగా ప్రకటించింది. పర్యాటకం పేరిట హోటల్స్, రిసార్ట్స్ ఏర్పాటును, అభివృద్ధి పేరిట మైనింగ్, పరిశ్రమల ఏర్పాటును నిషేధించింది.

ఈఎస్‌జడ్‌లో నిబంధనలు అతిక్రమిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 ప్రకారం శిక్షలు ఇలా

- ఐదేండ్ల వరకూ జైలుశిక్ష
- రూ. లక్షల వరకు జరిమానా
- నేరతీవ్రతను బట్టి పైరెండు శిక్షలు కూడా వేయవచ్చు

కఠినమైన శిక్షలు, జరిమానాలు

గంగానది జన్మస్థానంలో వృక్ష, పక్షి, క్షీరద జాతులకు హాని కలిగే చర్యలు చేపట్టేవారికి, నదీజలాల కలుషితానికి కారణమయ్యేవారికి కఠినమైన శిక్షలను అమలుచేయాలని, భారీ జరిమానాలు విధించాలని కేంద్రం తేల్చిచెప్పింది. చైనా సరిహద్దుల వరకు ఈ నియమాలు ఉన్నట్టు గెజిట్ నోటిఫికేషన్‌ను బట్టి అర్థమవుతున్నది. చార్‌ధామ్ ప్రాజెక్టు పేరిట గంగోత్రిలో రోడ్ల విస్తరణను చేపట్టాలనుకొన్న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్వో) చర్యలను సుప్రీంకోర్టు గతంలో తప్పుబట్టడం గమనార్హం. గంగానది విషయంలో కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత ప్రేమ చూపగా.. ఇప్పుడు మూసీనది విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు నిర్లిప్తంగా వ్యవహరిస్తుండటం సర్వత్రా విమర్శలకు కారణమవుతున్నది.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.1°c	23.3°c
మెదక్	36.7°c	21.1°c
రంగారెడ్డి	35.9°c	20.2°c
నిజామాబాద్	35.6°c	24.7°c
కరీంనగర్	33.0°c	24.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
వరంగల్	32.0°c	24.0°c
మహబూబ్‌నగర్	31.2°c	23.1°c
నల్లగొండ	31.0°c	23.0°c
హైదరాబాద్	31.0°c	23.6°c

అమెరికా వద్దంటే.. కాంగ్రెస్ సర్కార్ కావాలంటున్నది!

మొదటిపేజీ తరువాయి...

రాడార్‌ను, మేరీలాండ్‌లోని అన్నాపోలీస్ ఎన్ఎస్ఎస్ రాడార్‌ను అక్కడి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. స్థానికులు, పర్యావరణవేత్తల నుంచి వస్తున్న విమర్శలతోపాటు సాంకేతిక సమస్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు అక్కడి ప్రభుత్వాధికారులు చెప్తున్నారు. ఈ రాడార్ల ఇన్‌స్టాలేషన్‌తో స్థానికుల్లో ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదం ఉన్నదా?

వీఎల్ఎఫ్ రాడార్ అంటే 'వెరీ లో ఫ్రీక్వెన్సీ' రాడార్ అని అర్థం. ఈ వీఎల్ఎఫ్ రాడార్ వ్యవస్థ ద్వారా సముద్రంలో ఉన్న ఓడలు, జలాంతర్గాముల్లోని సిబ్బందితో సమాచారాన్ని పంచుకోవచ్చు. ఈ రాడార్ వ్యవస్థ ద్వారా 3 కేజీహెచ్‌జడ్ నుంచి 30 కేజీహెచ్‌జడ్ రేంజ్‌లో తరంగాలను ప్రసారం చేస్తారు. నీటిలో 40 మీటర్ల లోతు వరకు ఈ తరంగాలు ప్రసరించగలవు. వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటికి కూడా సిగ్నల్స్ చేరవేయగలవు. వీఎల్ఎఫ్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ తరంగాల కారణంగా ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. క్యాన్సర్, గుండెజబ్బులు, సంతానోత్పత్తిపై ప్రభావం, నిద్ర సమస్యల వంటివి రావొచ్చని కొందరు పరిశోధకులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇవి ఎంతవరకు నిజమో తెలియాలంటే మరిన్ని పరిశోధలు చేయాల్సి ఉన్నదని అభిప్రాయపడుతున్నారు.

ఏ దేశంలో.. ఏవి నిర్వీర్యం??

వీఎల్ఎఫ్ రాడార్ వ్యవస్థ పేరు	దేశం	నిర్వీర్యం చేసిన ఏడాది
అన్నాపోలీస్ ఎన్ఎస్ఎస్	అమెరికా	2021
ఎస్సాల్వీ	స్వీడన్	2020
ఉడ్‌సైడ్ –ఒమేగా స్టేషన్ జీ	ఆస్ట్రేలియా	2015
హెచ్‌బీజీ	స్విట్జర్లాండ్	2012
జీబీఆర్	యూకే	2007
ఆర్మేస్ ఓఎమ్‌ఏ	స్వీడన్	2004
జీబీజడ్ క్రిగియన్	యూకే	2003
బ్రాట్లాండ్-ఒమేగా స్టేషన్-ఏ	నార్వే	2002
హరుప్	జర్మనీ	2002
గోల్ఫో న్యూవో-ఒమేగా స్టేషన్-ఎఫ్	అర్జెంటీనా	1998
షుశీ వాన్-ఒమేగా స్టేషన్-హెచ్	జపాన్	1998

నేవీ రాడార్‌కు నేడే శంకుస్థాపన

- టేకులబిడు తండా సమీపంలో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రానికి భూమిపూజ
- హాజరుకానున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి
- 3200 కోట్లతో 2900 ఎకరాల్లో ఏర్పాటు
- అటవీ సంరక్షణపై పర్యావరణవేత్తల ఆందోళన
- సేవ్ దామగుండం పేరుతో ప్రజల నిరసన
- జేఏసీ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం
- రాడార్‌కు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్లు
- ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని విజ్ఞప్తి

వికారాబాద్, అక్టోబర్ 14, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా పూడూర్ మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో దేశంలోనే రెండో అతిపెద్ద వీఎల్ఎఫ్ నేవీ రాడార్ కేంద్రానికి మంగళవారం మధ్యాహ్నం 12.55 గంటలకు శంకుస్థాపన జరుగనున్నది. దామగుండం అడవి, పూడూరు మండల శివారు వికారాబాద్ మండలం టేకులబిడు తండా సమీపంలో భూమిపూజ కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తోకలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వికారాబాద్ కలెక్టరేట్ వద్ద హెలీప్యాడ్‌ను సిద్ధం చేయగా, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతారు. రాష్ట్ర మంత్రులతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్న ఈ కార్యక్రమానికి నేవీ, మిలటరీ, పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పదేండ్ల క్రితమే రాడార్ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపడంతో రాడార్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు.

2900 ఎకరాల్లో 3200 కోట్లతో..

రూ.3200కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ రాడార్ కేంద్రం కోసం దామగుండం అటవీ ప్రాంతంలో 2900 ఎకరాల అటవీ భూములను నేవీకి అప్పగించారు. ఈ భూముల్లో లక్షా93 వేల చెట్లు, 400 ఎకరాల్లో గడ్డి భూములు ఉన్నాయి. 500 ఏండ్లనాటి రామలింగేశ్వర స్వామి ఆలయం, ఔషధ మొక్కలు, 258 రకాల పక్షిజాతులు, జింకలు, దుప్పిలు, నెమళ్లు ఉన్నాయి. ఈ కేంద్రంతో అటవీ సంపద నాశనం అవుతుందని, జీవవైవిధ్యం దెబ్బతింటుందని పర్యావేరణవేత్తలు అభిప్రాయపడ్డారు. దామగుండంలో అడవుల్లో పుట్టే మూసీ, ఈసీ నదులు ప్రమాదంలో పడుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాడార్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా కోర్టుల్లో పర్యావరణవేత్తలు, దామగుండం అటవీ ప రిరక్షణ జేఏసీ అనేక పిటిషన్లు వేశారు. కానీ 2027 నాటికి ఈ రాడార్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తున్నది.

'రాడార్'కు వ్యతిరేకంగా ఉద్యమం

పూడూర్ మండలం దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో వీఎల్ఎఫ్ రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు, అటవీ ప్రేమికులు, స్థానిక ప్రజలు ఉద్యమిస్తున్నారు. సేవ్ దామగుండం పేరిట ప్రజాసంఘాలు, మేధావులు, పార్టీల నాయకులు, అధ్యాపకులు, ప్రకృతి ప్రేమికులు స్వచ్ఛందంగా తరలివచ్చి నిరసన వ్యక్తంచేస్తున్నారు. దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌కు ఆనుకొని 10 గ్రామాలతో పాటు ఐదారు తండాలు ఉన్నప్పటికీ పూడూర్ గ్రామ ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తీసుకోవడంపై మండిపడుతున్నారు. దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు.

చెట్ల నరికివేతపై రోజుకో మాట

దామగుండం అటవీ ప్రాంతంలో చెట్ల తొలగింపుపై అటవీ అధికారులు స్పష్టతనివ్వడం లేదు. మొదట కోర్టుకు సమర్పించిన సమాచారంలో 12 లక్షలకుపైగా చెట్లను తొలగించడం ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించడంతో అటవీ శాఖ రాష్ట్ర అధికారి 1.93 లక్షల చెట్లను మాత్రమే తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం 899 చెట్లను మాత్రమే తొలగించనున్నారని కోర్టుకు అటవీ శాఖ అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నారని దామగుండం అటవీ పరిరక్షణ సభ్యులు, పర్యావరణవేత్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తమ ఇండ్లపై హైకోర్టు ఆదేశాల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్న యజమానులు

'మూసీ' బుల్డోజర్లకు స్టే ఆర్డర్ బ్రేకులు!

మొదటిపేజీ తరువాయి...

చెందిన ఇండ్లను ఇప్పటికే రివర్ బెడ్ మార్కింగ్ చేసింది. వీటిని దశల వారీగా కూల్చనున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ బుల్డోజర్లు తమ ఇంటిపైకి రాకముందే మూసీ పరీవాహక ప్రజలు తమ ఇండ్లకు కోర్టు ఆదేశాలను రక్షణ కవచంలా ఏర్పాటు చేసుకుంటున్నారు. తొలి దశలో మార్కింగ్ చేసిన నిర్మాణాలను కూల్చివేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో మలక్‌పేట నుంచి నాగోల్ వరకు మూసీ వెంబడి ఉన్న పలు కాలనీ వాసులు ఇండ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా స్టే ఆర్డర్లు తెచ్చుకున్నారు. ఫణిగిరి కాలనీల్లో దాదాపు 25 నిర్మాణాలకు కోర్టు ఆదేశాలను అతికించగా, కోర్టు విచారణలో ఉందనీ, కూల్చివేతలు చేపట్టడానికి వీల్లేదని తెలుపుతూ నోటీసు బోర్డులను ఇండ్లకు అతికించారు.

సుప్రీం స్టే తీసుకువస్తాం

రాడార్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. సుప్రీం కోర్టుకు వెళ్లైనా స్టే తీసుకువస్తాం. మేం ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు. రాజస్థాన్‌లో ఎడారి ప్రాంతాలు, కొడంగల్‌లో బీడు భూములు చాలా ఉన్నాయి. ఈ కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం.

- దేవనోనిగూడెం వెంకటయ్య, దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ చైర్మన్

పోరాటం ఉధృతం చేస్తాం

ఆగమేఘాల మీద రాడార్ కేంద్రానికి భూమి పూజ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై పునరాలోచన చేయాలి. ప్రజాభిప్రాయాన్ని తీసుకోకుండా రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా బాధాకరం. రానున్న రోజుల్లో పోరాటం మరింత ఉధృతం చేస్తాం. కోర్టు ద్వారా తప్పని సరిగా విజయం సాధిస్తాం.

- రామన్న మాదిగ, దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ కో-ఆర్డినేటర్

మా ప్రాణాలూ ముఖ్యమే

దేశ రక్షణ ఒక్కటే కాదు.. మా ప్రాణాలు కూడా ముఖ్యం. రేడియేషన్ ప్రభావంతో అంగవైకల్యం, క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయి. శాస్త్రవేత్తలు, వైద్యులు, పర్యావరణవేత్తలు, ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలి. రాడార్ కేంద్రం ఏర్పాటుతో దామగుండంలో పుట్టిన మూసీ, ఈసీ నదుల మనుగడ ప్రశ్నార్థకం కానున్నది.

- సత్యనారాయణ, దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ సభ్యులు

ప్రధాని, సీఎం మధ్య రాడార్ బంధం

రాహుల్‌గాంధీ స్పందించాలి • ప్రాజెక్టుతో మానవ మనుగడకే ప్రమాదం

ప్రజాభిప్రాయం లేకుండానే శంకుస్థాపనా? • రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, అక్టోబర్ 14: వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మిస్తున్న నేవీ రాడార్ కేంద్రం ప్రాజెక్టుతో మానవ మనుగడే ప్రమాదమని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు సంపత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాడార్ ప్రాజెక్టు వల్ల జరిగే నష్టాలను వక్తలు ఎత్తిచూపారు. జర్నలిస్టు తెలంగాణ విఠల్ మాట్లాడుతూ రాడార్ స్టేషన్ నిర్మాణానికి ప్రజాభిప్రాయం ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ ప్రాజెక్టును వ్యతిరేకించారని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం రాడార్ స్టేషన్‌ను ఎందుకు నిర్మిస్తున్నారని నిలదీశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి బంధం అర్థమవుతుందని, దీనిపై రాహుల్‌గాంధీ స్పష్టత ఇవ్వాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రజలు, పర్యావరణానికి నష్టం చేకూర్చే వీఎల్ఎఫ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పేరుతో సహజ వనరులను దెబ్బతీస్తున్నారని, ఇందులో పాలకుల మతలబు వేరే ఉంటుందని చెప్పారు. పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఈ ప్రాజెక్టులో స్థానికులకు ఎలా ఉద్యోగాలు వస్తాయని ప్రశ్నించారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విఠల్. చిత్రంలో పాశం యాదగిరి, ప్రొఫెసర్ బాబురావు

ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రాజెక్టులకు సముద్రతీరాలను ఎంచుకోవాలని కోరారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని చెట్లు పెరగని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించుకోవాలని సూచించారు. క్లైమెట్ ఫ్రంట్ ప్రతినిధి రుచిత్ మాట్లాడుతూ ఈ అడవికి బదులు 17లక్షల మొక్కలు నాటుతామని చెబుతున్నారని, అది ఫెల్యూర్ ప్రక్రియ అని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, జర్నలిస్టు తులసి చందు తదితరులు పాల్గొన్నారు.

రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తున్నాం

నేడు నల్ల బ్యాడ్జీలతో నిరసన

బీఆర్ఎస్ నేత శుభప్రద్ పటేల్

హైదరాబాద్, అక్టోబరు 14 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ స్టేషన్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ నేత శుభప్రద్‌పటేల్ తెలిపారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు 1.5లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే... మరోవైపు మూసీని ముంచే రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలుపడం ఏమిటని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వికారాబాద్ కా హవా.. లాకో మరీజోంకా దవా అని నానుడిని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రాడార్ కేంద్రం ఏర్పాటుతో మనుషులు, జీవరాశులకూ పెను ముప్పు కలుగుతుందని తెలిపారు. రాడార్ కేంద్రాన్ని ఇక్కడి నుంచి తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. దామగుండంలో రాడార్ స్టేషన్‌ను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తామని శుభప్రద్ పటేల్ తెలిపారు.